సాక్షి
ప్రకాశం
మంగళవారం ၊ 9 ၊ సెప్టెంబర్ ၊ 2025



స్నేహితుడే కాలయముడు

బేస్తవారిపేట జంక్షన్ సమీపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి బ్రహ్మయ్య (25)ను హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

- 8లో..



ఇదేమి కవరింగ్ నానోయ్!

యూరియా అడుగుతుంటే నానో యూరియా వాడుకోవాలని పాలకులు ఉచిత సలహా ఇస్తున్నారు. యూరియా కొరత లేదని చెప్పేందుకు కూటమి నేతలు నానా తంటాలు పడుతున్నారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
38 /28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన ఉండాలి

● ఐసీడీఎస్ పీడీ సువర్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణ, పక్కన జేసీ ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వ్యతిరేక చట్టం–2013 గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ పేర్కొన్నారు. సోమవారం మీ కోసం భవన్‌లో మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి-సంకల్ప్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్, ప్రివెన్షన్, రెడ్రెసెల్ ఆఫ్ సెక్సువల్ హెరాస్మెంట్ ఎట్ వర్క్ ప్లేస్ యాక్ట్‌కు సంబంధించి జిల్లాలో పని చేస్తున్న ఏ కార్యాలయంలోనైనా, ఏ శాఖలోనైనా, పదిమంది లేదా అంతకంటే ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు ఉంటే కచ్చితంగా లోకల్ కంప్లైంట్స్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. సదరు వివరాలను పీడీ ఐసీడీఎస్ వారికి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలి, ఎంతమంది సభ్యులు ఉండాలి, కమిటీ ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణ, డీఆర్‌ఓ, ఒంగోలు ఆర్డీవో, వన్ స్టాప్ సెంటర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో 'కళా ఉత్సవ్-2025'

ఒంగోలు సిటీ: 'కళాఉత్సవ్-2025' ను జిల్లా స్థాయిలో సెప్టెంబరు 11, 12 తేదీల్లో ఆయా ఉమ్మడి జిల్లాల్లోని డైట్ లలో నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకత, కళాకౌశలం తదితర అంశాలను వెలికితీసి వారికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మంచి గుర్తింపును అందించే ప్రక్రియే ఈ 'కళాఉత్సవ్-2025' అని అన్నారు. ఇందులో 6 ప్రధాన, 12 ఉపప్రధాన అంశాల్లో ఈ పోటీలు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల పరిధిలోని 9,10,11,12 తరగతులు చదివే ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు గల ప్రైవేట్, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్, సంక్షేమ గురుకులాలు, విద్యార్థినీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, పర్చూరు డివిజన్లు, 12వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కందుకూరు డివిజన్లలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

సాగు నీవక.. బతక నీవక!

జిల్లాలో కూటమి ప్రభుత్వ దాష్టీకానికి హలధారి.. కన్నీరు పెడుతున్నాడు. పుట్టెడు ఒడ్లు పండించే రైతు పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్నాడు. కాడె పట్టే రైతు పాడెక్కి.. కాష్టంలో కాలిపోతున్నాడు. సాగు నుంచి పంట విక్రయం వరకు అడుగడుగునా అన్నదాత దోపిడీకి గురవుతున్నాడు. పట్టించుకోవాల్సిన ప్రభుత్వం పలాయన ధోరణితో వ్యవహరిస్తుండడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. కనీసం పెట్టుబడులు రాక పెరిగిపోతున్న అప్పుల కొండలను ఎక్కలేక 13 నెలల కాలంలో పది మంది రైతులు తనువుచాలించారు. ఉచిత బీమాకు చెల్లుచీటి కట్టేసింది. ఏడాది తర్వాత ఇచ్చిన అన్నదాత సుఖీభవకు కోతలు పెట్టింది. ఖరీఫ్‌లో విత్తనాలు, యూరియా దొరక్క పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రైతులకు అండగా నిలిచేందుకు మంగళవారం జిల్లాలో మూడు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని చేపడుతోంది.



కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు ఆత్మహత్యలివీ..

- పెద్దారవీడు పంచాయతీ సిద్ధిరాయునిపల్లికి చెందిన రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య (70) మిర్చి, పొగాకు సాగు చేసి అప్పుల పాలై 2024 అక్టోబర్ 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.
- అర్ధవీడు మండలం కాకర్లకు చెందిన చిన్న దిబ్బారెడ్డి (42) మిర్చి సాగు చేసి నష్టపోయి 2024 అక్టోబర్ 28వ తేదీ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- అర్ధవీడు మండలం చిములేటిపల్లెకు చెందిన రైతు నడిపి వెంకటేశ్వర్లు (43) పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు సాగుచేసి పంటలు సరిగా పండక, అప్పులు తీర్చే మార్గం తెలియక 2024 అక్టోబర్ 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయాడు.
- తాళ్లూరు మండలం చింతలపాలేనికి చెందిన కలువా బాలకోటిరెడ్డి మిర్చి ధరలు పడిపోయాయని, అప్పులు ఎలా తీర్చాలన్న ఆందోళనతో ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.
- మార్కాపురానికి చెందిన రాజారపు పెద్ద యలమందయ్య మిర్చి, పత్తి పంటలు సాగు చేసి నష్టపోయి అప్పుల బాధతో ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.
- తర్లుపాడు మండలం పోతలపాడుకు చెందిన రైతు రాచకొండ శ్రీను కంది, మిర్చి, పొగాకు పంటలు సాగు చేసి నష్టపోయాడు. అప్పుల బాధతో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఈ ఏడాది మార్చి 21వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.
- కొండపి మండలం నెన్నూరుపాడుకు చెందిన చల్ల మధుసూదన్ రెడ్డి (43) పొగాకు పంట సాగు చేసి వేలంలో సరైన ధరలు దక్కక మనస్తాపంతో ఈ ఏడాది జూన్ 6వ తేదీ కొండపి పొగాకు బోర్డు వెనుక పాకలో ఆత్మహత్య చేసుకున్నాడు.
- గిద్దలూరు మండలం ఓబులాపురానికి చెందిన కౌలు రైతు తొట్టింపూడి దిలీప్‌కుమార్ (30) పొగాకు సాగు చేసి నష్టపోయి ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీన అప్పుల బాధ తాళలేక చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- పెద్దదోర్నాల మండలం చిన్నగుడిపాడుకు చెందిన యువ రైతు నాలి శివ (30) ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీ పత్తి, మిర్చి సాగు చేసి అప్పుల పాలై పొలంలోనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- యర్రగొండపాలెం మండలం పాలుట్ల గిరిజన గూడేనికి చెందిన రైతు డి.రాములు నాయక్ (50) ఈ ఏడాది సెప్టెంబర్ 3వ తేదీ పత్తి, మిరప సాగు చేసి అప్పులపాలై పొలంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

- కర్షకుడి కష్టం దోచుకుంటున్న బాబు ప్రభుత్వం
- పదమూడు నెలల్లో 10 మంది అన్నదాతలు బలవన్మరణం
- కనీసం ఆ కుటుంబాలను ఆదుకున్నదీ లేదు..
- మిర్చి, పత్తి, శనగ, పొగాకు, వరి రైతులు కుదేలు
- కనీస మద్దతు ధర రాక ఆర్థికంగా నష్టపోయిన వైనం
- యూరియా లెక్కల్లో గోల్‌మాల్
- బ్లాక్ మార్కెట్‌లో రూ.450 నుంచి రూ.500 వరకు
- అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో 2024–25 రబీ సీజన్‌లో సాధారణంగా 3,97,880 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేయాల్సి ఉంది. అయితే, కేవలం 2,99,331 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. వేసిన పంటల్లో కూడా దాదాపు లక్షకుపైగా ఎకరాల్లో నిలువునా ఎండిపోయాయి. మిగతా 1.99 లక్షల ఎకరాల్లో కూడా సగానికిపైగా ఎకరాల్లో దిగుబడి మరీ దారుణంగా పడిపోయింది. ఇక ఖరీఫ్ సీజనూ అంతే. జిల్లాలో 1,29,102 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా 20 శాతం కూడా సాగుకాలేదని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఏడాది కాలంలో మిర్చి, పొగాకు, వరి, శనగ, పత్తి ఇలా అన్ని రకాల రైతులు కనీస మద్దతు రాక ఆర్థికంగా కుదేలయ్యారు. కనీస పెట్టుబడులు రాక, చేసిన అప్పులు తీర్చలేక 13 నెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా 13 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఫలితంగా ఆ కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. జిల్లాలో అన్నదాతల ఆత్మహత్యలను ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాల్లేవు.



రైతు యలమందయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)



దర్శి మండలం రాజంపల్లిలో దుకాణాలు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

దర్శిలో పక్కదారి..కొండపిలో ఖాళీగా ఆర్ఎస్‌కేలు..గిద్దలూరులో అరకొరగా..

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 24 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నారు. మరో పక్క వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు వస్తుందంటూ జేసీ ప్రకటించడం గమనార్హం. మరో వైపు ఆర్ఎస్‌కేల్లో నిల్వఉన్న యూరియాను పచ్చనేతలు చెప్పిన వారికే ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దర్శి నియోజకవర్గంలో ఆర్ఎస్‌కేలకు చేరాల్సిన యూరియా అధికార పార్టీ నేతల దుకాణాలకు వెళుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా దుకాణాలకు 30 శాతం, ఆఎస్‌కేలు, సొసైటీలకు 70 శాతం యూరియా అందాల్సి ఉంది. వచ్చిన డెబ్బై శాతం యూరియాను కూడా టీడీపీ అనుకూల ఎరువుల దుకాణాదారులు నేరుగా తమ గోడౌన్‌లలో దింపుకుని బ్లాక్ మార్కెట్‌లో గుట్టు చప్పుడు కాకుండా అధిక ధరలకు రైతులకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ధర ప్రకారం రూ.266.50 కు విక్రయించాలి. అయితే దర్శి నియోజకవర్గంలో యూరియా ధరలు బ్లాక్ మార్కెట్‌లో రూ.450 నుంచి రూ.500 వరకు ఉంది. అయితే నియోజకవర్గంలో యూరియా కొరత సృష్టించి మొత్తం బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు చేపట్టారు.ఇక కొండపిలో అయితే మండల స్థాయి వ్యవసాయాధికారులు రైతు సేవా కేంద్రాల్లో యూరియా పుష్కలంగా ఉందని చెబుతున్నా ఆర్ఎస్‌కేల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. నియోజకవర్గం మొత్తంలో కేవలం మర్రిపూడి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మాత్రమే యూరియా అందుబాటులో ఉంది. ప్రైవేటు దుకాణాల్లో యూరియా బస్తా ధర రూ.266 రూపాయలకు అమ్మాల్సి ఉండగా రూ.350 కు అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో యూరియా ఆర్ఎస్‌కేలకు పూర్తి స్థాయిలో అందడంలేదు. అరకొరగా రావడంతో రైతులు అధిక ధరకు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. గిద్దలూరులోని ఉయ్యాలవాడ, గడికోట ఆర్ఎస్‌కేలలో 25 టన్నులకు 12 టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. అర్ధవీడు మండలంలో ప్రైవేట్ దుకాణాల్లో గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తున్నారు. 12 టన్నులకు ఆర్డర్ పెడితే నేటికి రాలేదు. కంభం, రావిపాడు రైతు భరోసా కేంద్రాలకు 12 టన్నుల యూరియా ఆర్డర్ పెడితే ఆరు టన్నులే వచ్చింది. బేస్తవారిపేట మండలం పిటికాయగుళ్లలో రైతులకు సరఫరా చేయాల్సిన యూరియాలో ఇప్పటి వరకు సగమే ఇచ్చారు. రాచర్ల మండలంలో గడిచిన రెండు నెలలుగా జేపీ చెరువు రైతు సేవా కేంద్రంలో ఇప్పటి వరకూ యూరియా స్టాక్ లేకపోవడంతో రైతులు ప్రైవేటు ఎరువుల షాపుల్లో కొనుగోలు చేసుకుంటున్నారు. ఇలా అరకొరగా యూరియా పంపిణీ చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాత సుఖీభవకు భారీగా కోత

అన్నదాత సుఖీభవ పథకం కోసం జిల్లా అధికారులు ఎంతో కసరత్తు చేసిమరీ 2,65,317 మందిని అర్హులుగా తేల్చారు. జిల్లాలో మొత్తం 5,31,369 మంది రైతులను వెరిఫై చేసి 4,38,251 రైతుల జాబితా సిద్ధం చేశారు. ఆ జాబితాను ఉన్నతాధికారులకు పంపగా.. అందులో ఆర్‌ఐజీఎస్ పరిధిలో జాబితాను పరిశీలించి 2,72,824 మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించారు. చివరకు అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు 2,65,315గా తేల్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో రైతు భరోసా కింద జిల్లాలో సుమారు 2.85 లక్షల మంది రైతులకు సాయం అందేది. తాజా లెక్కల ప్రకారం 20 వేల మంది ఈ పథకానికి దూరమైపోయారు. సీఎం జిల్లాకు వచ్చి ఈ పథకాన్ని ప్రారంభించి వెళ్లారు. చాలా మందికి సంకేతిక సమస్యతో నగదు పడలేదని తెలుస్తోంది. తొలి ఏడాది సుఖీభవను ప్రభుత్వం ఎగ్గొటింది. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత బీమా సౌకర్యం ఉండేది. ఏసీజన్‌లో పంట నష్టానికి అదే సీజన్‌లో సాయం అందేది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత బీమాకు మంగళం పలికింది. రైతులే బీమా చేసుకోవాలంటూ భారాన్ని మోపింది. పంట నష్టం సాయం కూడా అరకొరగా అందుతోంది.

అక్రమ కేసులు.. వేధింపులు

- నిమజ్జన ఊరేగింపు వివాదంలో మరో 50 మందిపై కేసులు
- హత్యాయత్నం కేసులు నమోదు చేసి ఆరుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు రిమాండ్
- నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, న్యాయవాదులపై 132 బీఎన్ఎస్ఎస్ కేసు నమోదు
- డీఎస్పీ శ్రీనివాసరావు వైఖరికి నిరసనగా నేడు విధుల బహిష్కరణకు బార్ అసోసియేషన్ పిలుపు
- శ్రీనగర్ కాలనీలో బిక్కు బిక్కుమంటున్న భక్తులు



నిమజ్జనం ఊరేగింపులో పోలీసులు తోయడంతో కిందపడిన మహిళ

ఒంగోలు టౌన్: వినాయక నిమజ్జనం ఊరేగింపు వివాదంలో అక్రమ కేసులతో పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గణేష్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై హత్యాప్రయత్నం కేసులు నమోదు చేయడమే కాకుండా ఆరుగురు కార్యకర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అంతే కాకుండా మరో 50 మందిపై కూడా కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా న్యాయవాదులు, పరామర్శకు వెళ్లిన పార్టీ నాయకుల మీద కూడా కేసులు పెట్టడం విమర్శలపాలవుతోంది.

జగన్ పాటలు పెట్టడమే నేరమా...

నగరంలోని శ్రీనగర్ కాలనీ 4వ లైనులో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ మండపాన్ని ఏర్పాటు చేశారు. పోలీసుల అనుమతితో ఆదివారం నిమజ్జనానికి బయలుదేరారు. భక్తులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సాహంలో ఉన్న కొందరు యువకులు ఊరేగింపులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన పాటలు పెట్టారు. ఇదే పెద్ద నేరమైపోయిందని కాలనీ వాసులు, గణేష్ భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వాపోతున్నారు. నిజానికి ఈ నిమజ్జన ఊరేగింపు కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు సెంటర్, కొత్తపట్నం బస్టాండు సెంటర్ల మీదుగా కొత్తపట్నం బీచ్‌కు వెళ్లాల్సి ఉంది. ఊరేగింపులో రెండు డీజేలను కూడా ఏర్పాటు చేశారు. ఊరేగింపు మొదలైనప్పటి నుంచి పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడం మొదలు పెట్టినట్లు కాలనీ వాసులు చెబుతున్నారు. ఊరేగింపు ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గరకు రాగానే ట్రాఫిక్ ఎస్సై దాసరి శ్రీనివాసరావు, కానిస్టేబుల్ జి.రవికుమార్ అడ్డుకున్నారు. డీజే ధ్వంసం చేయడానికి ప్రయత్నించినట్లు కొందరు గణేష్ భక్తులు చెబుతున్నారు. దీంతో గణేష్ భక్తులు, మహిళలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, భక్తులకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఒక మహిళ ఎత్తుకొని ఉన్న చిన్నారి కిందపడిపోయింది. ఆందోళనకు గురైన మహిళలు చిన్నారిని కాపాడుకునే ప్రయత్నంలో పోలీసులను పక్కకు తోశారు. ఈ ప్రయత్నంలో మరికొందరు మహిళలు కూడా కిందకు పడిపోయారు. తోపులాట జరుగుతున్న సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీచార్జి చేయడంతో పలువురు మహిళలు, చిన్నారులకు దెబ్బలకు తగిలాయి. వాహనంపై అమర్చిన డీజేలను కూడా పోలీసులు తీసుకెళ్లారు. అయినా భక్తులు ఊరేగింపుగా కొత్తపట్నం బయలుదేరారు. ఈ ఘటనను మనసులో ఉంచుకున్న పోలీసులు కొత్తపట్నంలో నిమజ్జనం చేయకుండా అడ్డుకున్నట్లు భక్తులు చెబుతున్నారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

శ్రీనగర్ కాలనీలో భయాందోళనలో భక్తులు..

వినాయక నిమజ్జనం ఊరేగింపు ఘటనలకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ఆరుగురు భక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మరో 50 మందిపై కూడా కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడంతో శ్రీనగర్ కాలనీలో భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు బిక్కు బిక్కుమంటున్నారు. డివిజన్‌లోని 1వలైనులో నివసించే ఒక టీడీపీ నాయకుడు చెప్పిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సదరు టీడీపీ నాయకుడు ఎవరి పేరు చెబుతారోనన్న ఆందోళన కనిపిస్తోంది. దేవుడి ఊరేగింపును కూడా రాజకీయాలు చేయడమేమిటని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు.

పరామర్శకు వెళ్లిన వారిపై కేసులు...

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అరెస్టు చేసి తాలూకా పోలీసు స్టేషన్‌కు తీసుకొస్తున్నారన్న సమాచారంతో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు కొంత మంది న్యాయవాదులతో కలిసి పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లారు. అక్కడ వారు లేకపోవడంతో డీఎస్పీని కలిసి మాట్లాడదామని డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఆయన ముందే పోలీసు వ్యానులో పార్టీ కార్యకర్తలను తీసుకొని రావడంతో వారిని పరామర్శించేందుకు ప్రయత్నించారు. ఈలోపు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తన చాంబర్ నుంచి బయటకు వచ్చారని, వచ్చీ రాగానే ఆగ్రహంతో కేకలు పెడుతూ చుండూరి రవిబాబు, ఒంగోలు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు నగరికంటి శ్రీనివాసరావు, జయ చంద్ర నాయక్, షేక్ హిదాయతుల్లాపై అగ్గిమీద గుగ్గిలమయ్యారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. న్యాయవాదులనుద్దేశించి కులం పేరుతో దూషించారని, ఇక్కడేం పనిరా అంటూ బూతులు తిట్టారని చెబుతున్నారు. అంతటితో ఆగకుండా చుండూరి రవిబాబు, ముగ్గురు న్యాయవాదులపై విధులను అడ్డుకున్నట్లు 132 బీఎన్ఎస్ఎస్ కేసులు నమోదు చేయడంపై న్యాయవాదుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

దేవుడి బొమ్మ గిఫ్ట్ ఇచ్చినందుకు అరెస్టు చేస్తారా...

వినాయక నిమజ్జనం ఊరేగింపు సమయంలో పోలీసుల మీద దాడి చేసినందుకు ఆరుగురి మీద హత్యాప్రయత్నం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్న మాటలు నిజం కాదని స్థానికులు చెబుతున్నారు. ఈ కేసులో 6వ నిందితుడిగా ఉన్న మురుక నారాయణ రెడ్డిని వినాయకుడి విగ్రహం గిఫ్ట్‌గా ఇచ్చినందుకు అరెస్టు చేశారని ఆరోపిస్తున్నారు. దేవుడి బొమ్మ గిఫ్ట్‌గా ఇవ్వడం కూడా నేరమేనా అని పలువురు గణేష్ భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరుగురి మీదే కాకుండా మరో 50 మంది మీద కూడా కేసులు నమోదు చేయడానికి రంగం సిద్ధం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరెంత మంది అమాయకులను అరెస్టు చేస్తారోనని విమర్శిస్తున్నారు. అధికార తెలుగు దేశం పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి తప్పుడు కేసులు నమోదు చేయవద్దని కోరుతున్నారు.




వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

మైనార్టీలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం

- ఇమామ్, మౌజన్ వేతనాలు ఇవ్వకుండా ఆపిన ప్రభుత్వం
- కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జిల్లా కమిటీ

ఒంగోలు సబర్బన్: మైనారిటీలకు వ్యతిరేకంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్ ధ్వజమెత్తారు. ఇమామ్‌లకు, మౌజన్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయటం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు చేస్తున్న అన్యాయం, వివక్షపై జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాల పెండింగ్ మొత్తాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇమామ్‌లకు నెలకు రూ.10 వేలు, మౌజన్‌లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం నిరంతరాయంగా చెల్లిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారని అన్నారు. కానీ 2025 జనవరి నుంచి చెల్లింపులు జరగలేదని, ఎందుకు ఆపేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. మైనారిటీ నాయకుడు, సింగరాయకొండ-4 మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ సలీం మాట్లాడుతూ 2025 సెప్టెంబర్ నాటికి 8 నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సాధారణ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉన్న కాలం 2024 ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా గౌరవ వేతనాలు చెల్లించలేదని గుర్తు చేశారు. మొత్తంగా ఈఏడాది సెప్టెంబర్ 1 నాటికి 11 నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవి కుమార్ మాట్లాడుతూ మైనారిటీలంటేనే కూటమి ప్రభుత్వానికి గిట్టదని మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ నాయకులు ఎస్‌కే.సత్తార్, కరీం, జానీ, సింగరాయకొండ మండల జనరల్ సెక్రటరీ ఎస్‌డీ.ఆబిద్ అలీతో పాటు కరీం, ఎస్‌కే. అల్లా భక్షు, రహీం, పటేల్, జానీ భాష, జావీద్, ఎస్‌కే.సలీం, అహ్మద్ భాష, ఇంతియాజ్, అబ్దుల్లాతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ముస్లిం నేతలు

క్లుప్తంగా

పోలీసు గ్రీవెన్స్‌కు 49 ఫిర్యాదులు



సమస్యలు తెలియజేసేందుకు వచ్చిన బాధితులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 49 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు పోలీసు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన పోలీసు అధికారులు ఆయా పోలీసు స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ ఇన్‌స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

చెన్నకేశవుని హుండీ ఆదాయం రూ.12.45 లక్షలు



మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ.12.45 లక్షలు వచ్చిందని ఈఓ జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం చెన్నకేశవస్వామి ఆలయంలో 4 నెలల 16 రోజులకుగానూ హుండీ కానుకలు లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ పర్యవేక్షకులు సీహెచ్ వేణుగోపాల్‌రావు, రాజ్యలక్ష్మి సేవా సంఘం భక్త మహిళా సమాజం, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేమి కవరింగ్ నానోయ్!

- యూరియా టన్నులు టన్నులు నిల్వ ఉందని జంకు లేకుండా బొంకుతున్న పాలకులు.. రైతులకు అవసరమైన మేరకు యూరియాను ఎందుకు సరఫరా చేయడం లేదు?
- రైతు సేవా కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్న అన్నదాతలకు నానో యూరియా వినియోగించాలని ఉచిత సలహాలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటి?
- ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతు సేవా కేంద్రాలు, సొసైటీలకు చేరాల్సిన యూరియా ఇంత వరకు పూర్తి స్థాయిలో ఎందుకు సరఫరా కాలేదు?

జిల్లా వ్యాప్తంగా రైతులు సంధిస్తున్న ఈ ప్రశ్నలకు జవాబులు దాటవేస్తున్న పాలకులు.. యూరియా కొరత లేదని ఓ వైపు మభ్యపెడుతూ, మరోవైపు బ్లాక్ మార్కెట్ దందాను కప్పిపుచ్చుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నానో యూరియా వినియోగంతో నష్టమే తప్ప లాభం లేదని, పోషకాహార లోపం తలెత్తే పెను ప్రమాదం పొంచి ఉందని రెండేళ్ల పరిశోధన అనంతరం పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్శిటీ ఇటీవల వెల్లడించిన విషయం వ్యవసాయశాఖ అధికారులకు తెలిసినా.. అదే నానో యూరియాను వినియోగించాలని సూచించడంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

- యూరియా అడుగుతుంటే నానో యూరియా వాడుకోవాలని పాలకుల ఉచిత సలహా
- కొరత లేదని చెప్పేందుకు సీఎం చంద్రబాబు సహా కూటమి నేతల తంటాలు
- బ్లాక్ మార్కెట్ దందా బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు విశ్వప్రయత్నాలు
- నానో యూరియా వినియోగంతో నష్టమేనని ప్రకటించిన పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం
- నానో ఉత్పత్తుల ప్రభావంపై రైతుల ప్రశ్నలకు నీళ్లు నములుతున్న అధికారులు



దర్శి: యూరియా ఎక్కువ వాడితే క్యాన్సర్ వస్తుందని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు సెలవిచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. అదేమంటే.. ఈ ఏడాది ఎరువుల వినియోగాన్ని తగ్గించేందుకు పాలసీ తీసుకొస్తున్నామని చెప్పుకొచ్చారు. మంత్రుల దగ్గర నుంచి స్థానిక ఎమ్మెల్యేల వరకు అందరూ ఇదే పాట పాడుతున్నారు. వాస్తవానికి ఒక ఎకరా విస్తీర్ణంలో సాగు చేసే పంటల రకాన్ని బట్టి ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడిస్తారు. నిర్దేశిత పరిమాణంలో రైతులకు ఎరువులు సరఫరా చేయాల్సిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభంలోనే చేతులెత్తేసింది.

ఖరీఫ్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రైతు సేవా కేంద్రాలకు గానీ, సొసైటీలకు గానీ ఎరువులు పూర్తి స్థాయిలో చేర్చకుండా పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగు ఇప్పటి వరకు 45 శాతం మించలేదు. అయినప్పటికీ ఎరువుల కొరత ఉత్పన్నమవుతోందంటే పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం.. ఎరువులను సైతం ఎమ్మార్పీ ధరకు ఇవ్వలేకపోవడంపై రైతులు మండి పడుతున్నారు.

బ్లాక్ దందాను కప్పెట్టేందుకే..

రైతులకు అందించాల్సిన యూరియాను అక్రమంగా నిల్వ చేయడం, అత్యధికంగా వరి, ఇతర పంటలు సాగు చేస్తున్న ప్రాంతాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం, పరిశ్రమల అవసరాలకు తరలిపోతున్న యూరియాను అడ్డుకోకపోవడంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి. యూరియా కొరత ఏర్పడే ప్రమాదాన్ని ముందుగా పసిగట్టకుండా చోద్యం చూసిన ప్రభుత్వం.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా పస లేని వాదనలు తెరమీదికి తెస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన వారిలో కూటమి నేతల హస్తం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండటం, రైతులు, రైతు సంఘాల నాయకులు ధర్నాలకు దిగుతుండటంతో దిక్కుతోచని స్థితిలో నానో యూరియా పేరుతో కూటమి నేతలు సహా వ్యవసాయాధికారులు కవర్ డ్రైవ్‌లు చేస్తుండటం చర్చనీయాంశమైంది.

పాడి రైతుల గోడు పట్టేదెవరికి?

పంటకు యూరియా దొరక్క రైతులు అల్లాడుతుంటే.. పాడి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గేదెలకు ఆహారంగా అందించే సొప్ప, పచ్చి గడ్డి లాంటి రకాలకు యూరియా తప్పనిసరి. ఇతర రకాల ఎరువులు అధిక ధరకు కొని వేసినా యూరియాతో వచ్చే పెరుగుదల రాదని పాడి రైతులు చెబుతున్నారు. పచ్చిగడ్డి కొరత కారణంగా పాల దిగుబడి కూడా తగ్గిపోతోందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నానోకు అంత సీన్ లేదు!

సంప్రదాయ యూరియాకు నానో ప్రత్యామ్నాయం కాదని, దానికి అంత సత్తా లేదని పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వెల్లడించారు. సుమారు రెండేళ్లపాటు వరి, గోధుమ సాగులో నానో యూరియా వినియోగంపై చేసిన పరిశోధనా ఫలితాలను ఇటీవలే వెల్లడించారు. నానో యూరియా వినియోగంతో దిగుబడి తగ్గడమే కాదు.. పంటలో ప్రొటీన్ లోపం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2022–23, 2023–24 సీజన్లలో నానో యూరియా వినియోగించిన వరి, గోధుమ పంట పొలాలపై అన్ని కోణాల్లో లోతైన అధ్యయనం చేశారు. సంప్రదాయ యూరియా వినియోగించిన పొలాలతో పోలిస్తే నానో వినియోగించిన పొలాల్లో గోధుమలు 21.6%, ధాన్యం 13% మేర దిగుబడి తగ్గినట్టు గుర్తించారు. గోధుమలో 17%, బియ్యంలో 11.5% మేర ధాన్య నత్రజని స్థాయి పడిపోయిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ధాన్య నత్రజని లోపం వల్ల ఆహార ధాన్యాల్లో ప్రొటీన్ శాతం తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. నానో యూరియా ప్రభావాన్ని అంచనా వేసేందుకు 5 నుంచి 7 ఏళ్లపాటు ఫీల్డ్ ట్రయల్స్ అవసరమని సూచించారు. ప్రస్తుతం లభ్యమవుతున్న ఆధారాలను బట్టి సంప్రదాయ యూరియాకు నానోను ప్రత్యామ్నాయంగా పరిగణించలేమని తేల్చి చెప్పారు. పంటలకు నిర్దేశించిన ఎరువుల వినియోగంలో 25 శాతానికి మించి నానో ఎరువులు వినియోగించడం సరికాదని సూచించారు.

నానో కొంటేనే యూరియా బస్తా ఇస్తామంటున్నారు



మే నెలలో వరి పైరు సాగు చేశా. వరి నాటే సమయంలో రైతు భరోసా కేంద్రంలో యూరియా అందుబాటులో లేదు. నానో యూరియా, ఇతర ఎరువులు కొనుగోలు చేస్తేనే ఒక బస్తా యూరియా ఇస్తామని ప్రైవేట్ డీలర్లు చెప్పారు. తూర్పు గంగవరంలోని ప్రైవేట్ దుకాణంలో యూరియా బస్తా రూ.360కు కొన్నా. అధిక ధర పెట్టి యూరియా కొనలేం. ప్రభుత్వం సక్రమంగా సరఫరా చేయాలి.

– రావులపల్లి రాఘవులు, రైతు, మాధవరం, తాళ్లూరు

యూరియా కొరత ఎక్కువగా ఉంది



ఒక ఎకరంలో వరి పంట వేశా. మొక్కలు బాగుండాలన్నా, పంట దిగుబడి రావాలన్నా సంప్రదాయ యూరియానే వాడాలి. రైతు సేవా కేంద్రాల్లో యూరియా లేకపోవడంతో ప్రైవేట్ డీలర్లు ఎక్కువ ధర చెబుతున్నారు. యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దేవరకొండ పున్నయ్య, బెల్లంకొండవారిపాలెం, తాళ్లూరు

కారు ఢీకొని వృద్ధుడు మృతి

ఒంగోలు టౌన్: రాంగ్ రూట్లో వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న మోటారు బైకును ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రోవగుంట బ్రిడ్జి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు మండలంలోని అల్లూరు సీవై కాలనీకి చెందిన తొలవల శ్రీను, ఇండ్ల శ్రీను, అద్దూరి బ్రహ్మయ్య(60) బైక్‌పై ఒంగోలు నుంచి త్రోవగుంట వెళ్తున్నారు. త్రోవగుంట బ్రిడ్జి దిగిన వెంటనే ఎదురుగా రాంగ్ రూట్లో వచ్చిన కారు వీరి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్య అక్కడికక్కడే మరణించాడు. క్షతగాత్రులు తొలవల శ్రీను, ఇండ్ల శ్రీనును జీజీహెచ్‌కు తరలించారు. తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీకొని మరో వృద్ధుడు..

మార్కాపురం: బైకు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్టేట్ వద్ద చోటుచేసుకుంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. ఎస్టేట్‌లో నివసించే ఎస్.వీరారెడ్డి (60) సోమవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా కొనకనమిట్ల వైపు నుంచి మార్కాపురం వస్తున్న బైకు ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలైన వీరారెడ్డిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా కలుజువ్వలపాడు వద్ద వీరారెడ్డి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

కావలి వద్ద ఒంగోలు వాసి ఆత్మహత్య!

ఒంగోలు టౌన్: కావలి రైల్వే స్టేషన్లో ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. కావలి స్టేషన్‌లో దక్షిణం వైపున గుర్తు తెలియని వ్యక్తి ఒకరు పూరి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మరణించాడు. మృతుడి వయసు 55 ఏళ్లు ఉంటుంది. తెలుపు రంగు చొక్కా, పిస్తా గ్రీన్ కలర్ లుంగీ ధరించి ఉన్నాడు. అతడి వద్ద చెన్నై సెంట్రల్ నుంచి ఒంగోలు వరకు తీసుకున్న టికెట్ లభ్యం కావడంతో అతను ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. వివరాల కోసం 94406 27648ను సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై కె.వెంకటరావు సూచించారు.

స్నేహితుడే కాలయముడు!

- దరగా గ్రామానికి చెందిన బ్రహ్మయ్య హత్య కేసులో ముగ్గురు అరెస్టు
- యువతిని ప్రేమించే విషయంలో గొడవే హత్యకు కారణం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

బేస్తవారిపేట: బేస్తవారిపేట జంక్షన్ సమీపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త గాలి బ్రహ్మయ్య(25)ను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రేమించిన యువతి తండ్రికి తన గురించి చెడుగా చెప్పాడన్న అనుమానంతో మృతుడికి స్నేహితుడైన యువకుడు, తన మరో ఇద్దరు మిత్రులతో కలిసి హత్యకు పూనుకున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. సోమవారం బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హత్య కేసు వివరాలను డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. బ్రహ్మయ్య, గడ్డం వెంకట సాయి తేజ(రవి) ఇద్దరు స్నేహితులు. రవి అదే గ్రామంలో ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఇష్టపడిన అమ్మాయికి చెడుగా చెప్పడంతోపాటు తన ప్రేమను చెడగొట్టాడని బ్రహ్మయ్యపై రవి కక్ష పెట్టుకున్నాడు. జంక్షన్ సమీపంలో త్రిలోక పుణ్యక్షేత్రానికి వెళ్లే రోడ్డు పక్కన ఖాళీ ప్లాట్లలో తరచూ ఫోన్ మాట్లాడుతున్న బ్రహ్మయ్యను అక్కడే చంపాలని నిర్ణయించుకున్నాడు. హత్య చేయడానికి 15 రోజులుగా ముందుగానే ఓ కత్తిని ఖాళీ ప్లాట్లలో దాచిపెట్టాడు. ఒక్కడినే హత్య చేయలేనని భావించి, అతని వాటర్‌ప్లాంట్‌లో గతంలో పనిచేసిన బాలుడికి డబ్బు ఆశ చూపాడు. ఈనెల 3వ తేదీన బ్రహ్మయ్యను హత్య చేసేందుకు పథకం సిద్ధం చేశానని, వాటర్ ప్లాంట్‌లో పనిచేసిన వ్యక్తికి చెప్పాడు. అతను మరో స్నేహితుడితో కలిసి సాయిబాబా ఆలయానికి వెళ్లే రోడ్డులో కాపుకాశారు. హత్య జరిగిన రాత్రి 10 గంటల సమయంలో బ్రహ్మయ్య, రవి ఇద్దరు కలిసి మద్యం తాగారు. ఈ క్రమంలో యువతితో ప్రేమను చెడగొట్టిన విషయం, ఆ యువతి తండ్రికి చెడుగా చెప్పడంపై రవి ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుసుకుంది. మద్యం మత్తులో ఉన్న బ్రహ్మయ్యపై రవి తన ఇద్దరు మైనర్ స్నేహితులతో కలిసి బండరాయితో దాడి చేశాడు. అనంతరం ఛాతీపై ఆరుసార్లు కత్తితో పొడిచారు. బ్రహ్మయ్య మృతదేహాన్ని చిల్లచెట్లలోకి ఈడ్చుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టారు. బ్రహ్మయ్యకు చెందిన సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన వస్తువులను చిన్నకంభం సమీపంలోని ఉప్పువాగులో పడేశారు. ప్రధాన నిందితుడు రవి, తన ఇద్దరు మైనర్ స్నేహితులను ఆదివారం మధ్యాహ్నం జేబీకే పురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో కంభం సీఐ మల్లికార్జున, బేస్తవారిపేట, కంభం ఎస్సైలు ఎస్‌వీ రవీంద్రారెడ్డి, బి.నరసింహారావు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీసులు

- టీడీపీ నేతల మెప్పు కోసం చీమకుర్తి పోలీసుల ఓవరాక్షన్
- చిన్న వివాదాన్ని సైతం పెద్దదిగా చేస్తున్న ఖాకీలు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధిస్తున్న సీఐ

సాక్షి టాస్క్‌ఫోర్స్: చీమకుర్తి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అధికార టీడీపీ నేతల ఒత్తిడితో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్నారు. వారం రోజుల కిందట వినాయకనిమజ్జనం సందర్భంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవపై సీఐ ఓవరాక్షన్ చేస్తున్నారు. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ప్రతి రోజూ పోలీస్‌స్టేనషన్‌కు పిలిపించి ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కౌన్సెలింగ్ పేరిట వేధింపులకు గురిచేస్తున్నారని తెలుస్తోంది. సీఐ అత్యుత్సాహంతో పదేపదే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బూతులు తిడుతూ, లాఠీలతో కొడుతూ టీడీపీ నేతలను సంతృప్తి పరిచే దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. వారిపై దాడులు చేసి, భయభ్రాంతులకు గురిచేస్తూ టీడీపీకి తొత్తుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నా నిమజ్జనం సందర్భంగా జరిగిన చిన్న వివాదాన్ని పెద్దదిగా చేస్తూ టీడీపీ నేతల మెప్పుపొందేలా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా వివాదంపై వైఎస్సార్‌సీపీ వారు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించలేదని తెలిసింది. కనీసం టీడీపీవారిని పిలిపించి మాట్లాడింది కూడా ఏమీలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ వారు ఏమి చేసినా ఆయన మిన్నకుండిపోతున్నారు.

రౌడీషీట్ ఓపెన్ చేస్తాం..

ఇదిలా ఉండగా ఈ నెల 2వ తేదీన వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా తొర్రగుడిపాడు గ్రామ పంచాయతీ కార్యలయం కూడలిలో ఉన్న వైఎస్సార్‌సీపీ జెండా పోలు వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి ఫొటో పెట్టి పూల మాలలు వేసి నివాళులు అర్పించి ఎవరిపాటికి వెళ్లిపోయారు. రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు తొర్రగుడిపాడుకు వచ్చి హంగామా సృష్టించారు. వెంటనే వచ్చి వైఎస్సార్ సీపీ జెండా పోల్ తీసేయాలని, లేకపోతే మీ అందరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో జెండా పోల్‌ను వైఎస్సార్ సీపీ శ్రేణులు అయిష్టంగానే తొలగించాయి. మండలంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలయాల్లో చోరీలు చేస్తున్న ఇద్దరు అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న సీసీఎస్ సిఐ జగదీష్

ఒంగోలు టౌన్: దేవాలయాల తాళాలు పగలగొట్టి చోరీ చేయడంతోపాటు మోటారు బైకులను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను ఒంగోలు సీసీఎస్, తాళ్లూరు పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. సోమవారం సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ జగదీష్ వెల్లడించారు. పామూరు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి లక్ష్మీ నారాయణ, పల్నాడు జిల్లా నరసారావుపేట మండలం దొండపాడు గ్రామానికి చెందిన పులి అంజిరెడ్డి స్నేహితులు. దొంగతనాలు చేయగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. వీరిపై జిల్లాలోని పుల్లలచెరువు, కనిగిరి, సిఎస్ పురం, పొదిలి, ఒంగోలు టూ టౌన్, ఒంగోలు తాలుకా, త్రిపురాంతకం, దర్శి, టంగుటూరు, మద్దిపాడు, పల్నాడు జిల్లాలోని వినుకొండ, రొంపిచెర్ల, పిడుగురాళ్ల, వినుకొండ, గుంటూరు జిల్లాలోని అరండల్ పేట, తాడేపల్లి, కర్నూలు జీఆర్పీ, నెల్లూరు జిల్లాలోని ఉలవపాడు పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయి. ఈ నెల ఒకటో తేది రాత్రి తాళ్లూరు మండలం సోమవరప్పాడు గుంటిగంగ దేవాయలంలో శివాలయం గేటు తాళాలు పగలగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. గత నెల ఆగస్టు 30వ తేదీన దర్శిలోని అద్దంకి రోడ్డులో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిపి ఉన్న మోటార్ సైకిల్‌ను అపహరించారు. నరసరావుపేట, గుంటూరులోనే ఇదే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు సీసీఎస్ సీఐ జగదీష్, తాళ్లూరు ఎస్సై మల్లికార్జునరావు, ఏఎస్ఐ మోహనరావు, సీసీఎస్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి గుంటిగంట ఆలయంలో చోరీ కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం గుంటిగంగ ఆలయ పరిసరాల్లోని వడియరాజుల సత్రం వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7,060 నగదు, 4 బైకులు స్వాధీనం చేసుకున్నారు.

కూటమి పాలనలో రైతు కంట కన్నీరే..



అన్నదాత పోరు వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సురేష్, పార్టీ నేతలు

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ:

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడం లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రవర్తనే ఇందుకు నిదర్శనమని, ఎరువుల కోసం రైతులు పడుతున్న బాధలే సాక్ష్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. సింగరాయకొండలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన అన్నదాత పోరు నిరసన కార్యక్రమన్ని విజయవంతం చేయాలని రైతులు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏటా 16 లక్షల టన్నుల ఎరువులు అవసరమైతే కేవలం 11 లక్షల టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ గణాంకాల ప్రకారం ఏపీలో 40 శాతం ఎరువుల కొరత ఉందన్నారు. యూరియా వాడితే క్యాన్సర్ సోకుతుందని సీఎం చంద్రబాబు చెప్పడాన్ని తప్పుబట్టారు. కేంద్రం సరఫరా చేసే ఎరువులను మనకు ఎంత అవసరమో తెప్పించకుండా, బ్లాక్‌మార్కెట్‌ను ప్రోత్సహిస్తూ ఎరువుల వాడకం తగ్గించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. రూ.266 యూరియా బస్తాను బ్లాక్‌మార్కెట్‌లో రూ.450 అమ్ముతుంటే సీఎం, మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బాపట్ల, కృష్ణా, కడప జిల్లాలో ఎరువుల కొరత ఉందని సాక్షాత్తు చంద్రబాబే ఒప్పుకున్నారని గుర్తు చేశారు.

ఈఎస్సై ఆస్పత్రుల కుంభకోణం, వ్యవసాయ పరికరాల కొనుగోలు కుంభకోణాల్లో నిండా మునిగిన అచ్చెన్నాయుడు ఇప్పుడు ఎరువుల వ్యవహారంలో రూ.300 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ సంవత్సరం మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలు, ఆర్‌బీకేలు, మార్కెట్ కమిటీల ద్వారా సరఫరా చేసే ఎరువుల కన్నా ప్రైవేటుకు అధనంగా పంపిణీ చేశారని, ఇందుకు చంద్రబాబు, అచ్చెన్నాయుడు భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదాత పోరులో భాగంగా ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా చూడాలని, బ్లాక్ మార్కెట్ పై ఉక్కుపాదం మోపి ఎరువులను ప్రక్కదారి పట్టిస్తున్న వారిపై ఎస్మా చట్టం విధించాలని, పంటలకు గిట్టుబాటు ధర, భీమా కల్పించాలని, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంగళవారం ఒంగోలు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేస్తామని, ఈ కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, బచ్చల కోటేశ్వరరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర బత్తుల అశోక్‌కుమార్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బొట్ల రామారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

మార్కాపురం: ప్రైవేట్ వ్యక్తులతో సంబంధం లేకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మెడికల్ కళాశాలలు నిర్మాణం పూర్తి చేసి, నిర్వహించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశానికి కేంద్రంగా ఉన్న మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని, పీపీపీ విధానంలో ప్రైవేట్ వారికి అప్పగించవద్దని డిమాండ్ చేశారు. కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను బదిలీ చేయడం సరికాదన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రజలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షలా ఉందని అన్నారు. తీవ్రమైన జబ్బుల బారినపడిన రోగులు వైద్యం కోసం కర్నూలు, గుంటూరు, హైదరాబాద్, ఒంగోలు ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. జిల్లా వైద్యశాలలో వైద్యుల కొరత ఉందన్నారు. 70 శాతం పూర్తయిన కాలేజీ నిర్మాణాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం నిలిపివేయడం, డాక్టర్లను బదిలీ చేయడాన్ని తప్పుబట్టారు. గతంలో 700గా ఉన్న ఓపీల సంఖ్య ప్రస్తుతం 300కు చేరిందన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూబెన్, రాజు, మల్లికార్జున, సురేష్ కుమార్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు